సాక్షి
కాకినాడ
ఆదివారం । 24 । నవంబర్ । 2024



రూ.20లక్షల విలువైన గంజాయి పట్టివేత

దేవరపల్లి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై పోలీసులు 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.




బిడ్డను చూడకుండానే అనంత లోకాలకు..

పండంటి మగబిడ్డను జన్మనిచ్చిన తల్లి.. ఆ బిడ్డను చూసుకోకుండానే కన్నుమూసింది. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో ఈ విషాద ఘటన జరిగింది.

8లో

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 600, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా దేవస్థానానికి రూ.3,86,198 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆరు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

నెల ముగుస్తున్నా వేతనాలేవీ?

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామంటూ రెండు మూడు నెలలు హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రోజులు గడుస్తున్నా.. ఉద్యోగులకు జీతాలు చెల్లించడంతో అలసత్వం వహిస్తోంది. నవంబర్ నెల వారం రోజుల్లో ముగిసిపోతుంది. అయినప్పటికీ ఇప్పటి వరకూ తమకు జీతాలు జమ కాకపోవడంతో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. అక్టోబర్ నెల జీతాలు ఇప్పటి వరకూ చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా రెగ్యులర్ గ్రంథాలయ ఉద్యోగులు 61 మంది, పెన్షనర్లు 160 మంది ఉన్నారు. వీరితో పాటు గ్రామ, పట్టణ స్థాయిల్లో పుస్తక నిక్షిప్త కేంద్రాలు 158 ఉన్నాయి. వీరందరికీ కలిపి ప్రతి నెలా రూ.1.10 కోట్ల వరకూ వేతనాలుగా చెల్లిస్తున్నారు.. ఈ నెలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. వీటి నిర్వహణకు రూ.10 వేల చొప్పున కేటాయించారు. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే జీతాలు రాక ఇబ్బంది పడుతుంటే, గ్రంథాలయ వారోత్సవాలను అప్పు చేసి నిర్వహించాల్సి వచ్చిందని గ్రంథాలయ ఉద్యోగులు వాపోతున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-17 అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) రగ్బీ పోటీలు జిల్లా క్రీడా మైదానంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు ఈ పోటీలను ప్రారంభించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి జార్జి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శ్రీనివాస్ కుమార్, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 156 మంది బాలికలు, 40 మంది సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. క్రీడాకారిణులను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ పరిచయం చేసుకుని తొలి రోజు పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు అనంతపురంపై గుంటూరు 10-0, చిత్తూరుపై శ్రీకాకుళం 20-0, కర్నూలుపై తూర్పు గోదావరి 15-0, విశాఖపై ప్రకాశం 15-0 స్కోర్‌తో విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో రగ్బీ సంఘం కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించండి



శంకర్ నాయక్‌ను సత్కరిస్తున్న ఇన్చార్జి వీసీ మురళీకృష్ణ తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ): విశ్వ విద్యాలయంలోను, క్యాంపస్ కళాశాలల్లోను రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమశంకర్ నాయక్ సూచించారు. జేఎన్‌టీయుకేలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, విద్యా సంబంధిత అంశాలపై వీసీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ, అధ్యాపకులకు, సిబ్బందికి పదోన్నతుల్లోను, విద్యార్థులకు విద్యాపరంగా మౌలిక సదుపాయాలను నిబంధనల మేరకు కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సెల్ లైజనింగ్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్‌ను ఇన్చార్జి ఉప కులపతి కేవీఎస్ మురళీకృష్ణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కణకణ మండే అగ్ని కీలల నుంచి ఎగసిపడే నిప్పురవ్వలు.. పిడికిళ్లు బలంగా బిగించి మలాటు(పెద్ద సుత్తి వంటి సాధనం)లతో ఇనుప కమ్మెలపై కార్మికులు గట్టిగా కొడుతున్న శబ్దాలు ఆ ఊళ్లో సర్వసాధారణం. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో రైతన్నకు ఉపయోగపడే కొడవళ్లతో పాటు, ఇతర పనిముట్ల తయారీలో రేయింబవళ్లు శ్రమిస్తుంటుంది నడకుదురు గ్రామం.



కొలిమిలో ఇనుమును కాల్చి కొడవలి తయారు చేస్తున్న కార్మికులు

కొడవలి.. బతుకు వారధి

- మూడు తరాలుగా కొడవళ్ల తయారీ
- నడకుదురులో పలు కుటుంబాలకు ఇదే వృత్తి
- ఉమ్మడి తూర్పు గోదావరితో పాటు పలు జిల్లాలకు ఎగుమతులు
- వ్యవసాయ సీజన్‌లో రైతుల అడుగులు ఆ గ్రామం వైపే..

కాకినాడ సిటీ: వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే ఎక్కువ మంది రైతుల అడుగులు నడకుదురు గ్రామం వైపే పడతాయి. కాకినాడ సిటీకి కూత వేటు దూరాన.. కరప మండలంలో ఉన్న ఈ ఊరు పంట కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీకి పెట్టింది పేరు. వరి, మినుముతో పాటు, గడ్డి కోతలకు అవసరమైన కొడవళ్లను, ఇతర పనిముట్లను నడకుదురు గ్రామంలో తయారు చేస్తుంటారు. సుమారు 80 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో కొడవళ్ల తయారీ ప్రారంభమైంది. ప్రస్తుతం నాణ్యమైన కొడవళ్లను నైపుణ్యంతో తయారు చేయడంలో మూడో తరం కార్మికులు నిమగ్నమై ఉన్నారు. ఈ గ్రామంలో నాలుగు కుటుంబాలకు చెందిన వారు సుమారు 46 మందికి పైగా ఐదుకు పైగా కొలుముల్లో పని చేస్తున్నారు.



కొడవళ్లతో పాటు తయారు చేసిన ఇతర వస్తువులు

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు

నడకుదురులో తయారైన కొడవళ్లు తెలుగు రాష్ట్రాల నలుమూలలకూ సరఫరా అవుతున్నాయి. అంతేకాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు సైతం ఇక్కడి కొడవళ్లు ఎగుమతి అవుతున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి సైతం కొంతమంది రైతులు నడకుదురు గ్రామానికి వచ్చి మరీ కొడవళ్లు కొనుగోలు చేస్తుండటం విశేషం.

గిట్టుబాటు కాక..

కొడవళ్ల తయారీకి ఉపయోగించే బేల్ బద్దలను రాజమహేంద్రవరం, మండపేట, విశాఖపట్నంతో పాటు విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి, దిగుమతి చేసుకుంటారు. ఏటా ముడి సరకు ధరలు పెరుగుతున్నా కొడవళ్ల ధరలు పెరగడం లేదు. బేల్ బద్దల లోడు గత ఏడాది రూ.58 వేల నుంచి రూ.60 వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.65 వేలకు పెరిగింది. దీంతో పాటు కొడవలి తయారీకి అవసరమైన బొగ్గులు, చెక్కతో పాటు రవాణా చార్జీలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో తమ శ్రమ వృథా అవుతోందని, వస్తున్న డబ్బులు గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. అలాగే, తయారైన కొడవళ్లకు అమర్చేందుకు చెక్కతో చేసిన పిడులు అవసరమవుతాయి. ఈ పిడులు తయారు చేసేందుకు గతంలో గ్రామంలోనే ప్రత్యేకంగా కొంత మంది కార్మికులుండేవారు. వేరే ఉపాధి అవకాశాలు రావడంతో కొంత మంది, శ్రమకు తగిన ఫలితం దక్కక మరి కొంత మంది ఈ వృత్తికి దూరమయ్యారు. ఫలితంగా గ్రామంలో పిడులు తయారు చేసేవారు కనుమరుగయ్యారు. ప్రస్తుతం పిడులను జైపూర్ నుంచి అధిక ధరలకు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

యాంత్రీకరణతో తగ్గిన డిమాండ్



కొడవలి తయారు చేస్తున్న కార్మికుడు

వ్యవసాయంలో కొన్నేళ్లుగా పెరుగుతున్న యాంత్రీకరణ కొడవళ్ల తయారీపై కొంత మేర ప్రభావం చూపింది. గతంలో నడకుదురు నుంచి వేలాదిగా కొడవళ్ల అమ్మకాలు జరిగేవి. ప్రస్తుత్తం వీటికి డిమాండ్ బాగా తగ్గిందని, దీంతో పని వారు కూడా రావడం లేదని తయారీదార్లు చెబుతున్నారు. తమ కార్ఖానాల్లో ఏడాదంతా కొడవళ్లు తయారు చేసినా.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నాలుగు నెలలూ పని ఒత్తిడి అధికంగా ఉండేదని అంటున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి చాలావరకూ తగ్గిందని, దీంతో ఉపాధి తగ్గి, తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు వివిధ రకాల సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకొనేవారని, ప్రస్తుత ప్రభుత్వం ఆవిధంగా ఆదుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు.

కొలిమిలో కాలి.. కొడవలిగా మారి..



కొడవళ్లు తయారు చేసే కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుంటూంటారు. తొలుత ముడి ఇనుప బద్దీలను కొలిమిలో ఎర్రగా కాలుస్తారు. అనంతరం, ఆ ఇనుప బద్దలను మలాటులతో బలంగా కొట్టి, కొడవలి ఆకృతిలోకి మలుస్తారు. ఆ తర్వాత దానికి సాన పట్టి, నొక్కులు కొట్టి, చెక్క పిడులు అమరుస్తారు. ఒక్కో కొలిమిలో రోజుకు సుమారు 200 కొడవళ్లు తయారు చేస్తూంటారు. వీటిని రూ.40, రూ.60, రూ.80, రూ.120 ధరల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేస్తారు. గతంలో నడకుదురు గ్రామంలో సీజన్‌లో 80 వేలకు పైగా కొడవళ్లు తయారు చేసేవారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కొడవళ్లకు గిరాకీ తగ్గింది. దీంతో ఈ కార్మికులు వ్యవసాయ, ఇంటి పనులకు ఉపయోగించే గునపాలు, పారలు, కత్తిపీటల వంటి వాటితో పాటు పంచాయతీ కార్మికులు వినియోగించే వివిధ రకాల వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

నాణ్యత పాటిస్తాం



నడకుదురులో మా మూడు కుటుంబాలకు చెందిన వారు కొడవళ్ల తయారీలో నిరంతరం శ్రమిస్తుంటారు. నాణ్యమైన ముడి ఇనుమును ఉపయోగించటంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ కొడవళ్లు తయారు చేస్తాం. దీంతో అవి ఎక్కువ కాలం రైతులకు ఉపయోగపడతాయి. అందువల్లనే మా నడకుదురు కొడవళ్లకు మంచి పేరు ఉంది. పంట కోత యంత్రాలు రావడంతో కొన్నాళ్లుగా కొడవళ్లకు డిమాండ్ తగ్గింది. దీంతో ఇతర ఉపకరణాలు తయారు చేసి, అమ్ముతున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

– కణితి రాంబాబు,
కొడవళ్ల తయారీ కార్మికుడు, నడకుదురు

సబ్సిడీపై రుణాలివ్వాలి



గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. నాటికి, నేటికి ముడి సరకుల ధరల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. మేము చేసే కొడవళ్లకు గిరాకీ ఉన్నా.. గిట్టుబాటు ధర దక్కడం లేదు. ప్రభుత్వం మాపై దృష్టి సారించి, కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి. సబ్సిడీపై రుణాలు అందించడంతో పాటు ముడి వస్తువులకు సబ్సిడీ కూడా ఇవ్వాలి.

– కణిత నాగేశ్వరరావు,
కొడవళ్ల తయారీదారు, నడకుదురు

లెక్కల మాస్టారి లెక్క సరి

- టీచర్ అసభ్య ప్రవర్తనపై గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ సదస్సులో విద్యార్థినుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసుల



శ్రీనివాసరావును స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం: విద్యాబుద్ధులు నేర్పి, విద్యార్థుల్లో తన పిల్లల్ని చూసుకోవలసిన తండ్రి వయసున్న ఓ లెక్కల మాస్టారు అభం శుభం తెలియని పసిపిల్లల్లో అడతనం చూశాడు. తాకకూడని చోట్ల తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఎట్టకేలకు పోలీసులు, పిల్లల తల్లిదండ్రులు కలిసి ఆ లెక్కల మాస్టారి లెక్క సరిచేశారు. వివరాల్లోకి వెళితే.. సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో కాకినాడ వన్ టౌన్ పోలీసులు జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లోని బాలయోగి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో శనివారం గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాడ్ టచ్ గురించి చెబుతున్న క్రమంలో పలువురు 6, 7 తరగతుల విద్యార్థినులు పోలీసులు ఎలా తాకకూడదని చెబుతున్నారో.. తమలో కొందరిని తమ లెక్కల మాస్టారు శ్రీనివాసరావు తాకుతున్నాడని చెప్పారు. పాఠశాలకు హాజరు కాకపోవడం, హోం వర్క్ చేయకపోవడం, లెక్కల్లో సందేహాలు తీర్చడం సాకుగా ఉద్దేశపూర్వకంగా పలుమార్లు తమను అసభ్యంగా తాకాడని ఆవేదన చెందారు. దీనిపై పోలీసులు లోతుగా పరిశీలించడంతో శ్రీనివాసరావు నిర్వాకం వెల్లడైంది. అప్పటికే విద్యార్థినుల తల్లిదండ్రులకు విషయం తెలియడంతో పాఠశాలకు వచ్చి శ్రీనివాసరావుకు దేహశుద్ధి చేశారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. 2016 నుంచి అదే పాఠశాలలో పని చేస్తున్న శ్రీనివాసరావు ఇంకెన్ని ఘోరాలకు పాల్పడ్డాడోననే విషయమై ఆరా తీస్తున్నారు. బాధిత విద్యార్థినులు ఎవరైనా ఉంటే తమ తల్లిదండ్రుల ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ నాగదుర్గారావు తెలిపారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ కార్యక్రమం వేదికగా విద్యార్థినులు తమ గురువు నిర్వాకాన్ని బట్టబయలు చేయడంపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. సీఐ నాగదుర్గారావును, ఆయన బృందాన్ని అభినందించారు.

ఏ ఒక్కటీ వదలొద్దు

- జీజీహెచ్‌లో పోస్టుల భర్తీ అవినీతిపై కలెక్టర్ స్పందన
- తుది నివేదిక సమర్పించాలని విచారణ కమిటీకి ఆదేశం

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ క్రైం: జీజీహెచ్ మేనేజర్‌గా వైవీఎస్ఎస్ నరసింగరావు బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచి నేటి వరకూ చేపట్టిన నియామకాలన్నింటిపై లోతైన విచారణ జరిపి, త్వరితగతిన తుది నివేదిక సమర్పించాలని కలెక్టర్ షణ్మోహన్ విచారణ కమిటీని ఆదేశించారు. 'పోస్టులే లేవు... భర్తీ చేసేశారు' శీర్షికన 'సాక్షి' శనివారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మేనేజర్ నరసింగరావుపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన హయాంలో చేపట్టిన ఏ ఒక్క రిక్రూట్‌మెంట్‌నూ విచారించకుండా వదలవద్దని స్పష్టం చేశారు. నరసింగరావుకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పసుపులేటి అనురాధ పాత్రపై కూడా నిగ్గు తేల్చాలని ఆదేశించారు. నర్సింగ్ పోస్టులు, తాజాగా మంజూరైన పోస్టుల అడ్డగోలు అమ్మకాలతో కలిపి భారీ అవినీతి జరిగిందని ప్రస్తావిస్తూ జీజీహెచ్ విచారణ బృందం అందించిన నివేదికతో కలెక్టర్ ఏకీభవించారు. తాజా విచారణ అంశాలను గత విచారణ నివేదికలోని అంశాలతో జత చేసి, ఉమ్మడి తుది నివేదికను తుది చర్యల కోసం తనకు సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు విచారణ కమిటీ పోస్టుల భర్తీ అవకతవకలపై మరింత లోతైన విచారణ చేపట్టనుంది. సెలవుల అనంతరం మంగళవారం విధుల్లో చేరబోతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ద్వారా అదే రోజు కలెక్టర్‌కు తుది నివేదిక సమర్పించనుంది.

రత్నగిరి.. భక్తజనఝరి

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- వ్రతాలు 5,800
- ఆదాయం రూ.60 లక్షలు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: భారీగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ వేలాదిగా భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలం నిండిపోయింది. సాయంత్రం 4 గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు 5,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు తెలిపారు.

లక్ష దాటిన వ్రతాలు

కార్తిక మాసంలో ఇప్పటి వరకూ, 1.02 లక్షల సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం నాటికి 96,738 వ్రతాలు జరగ్గా, శనివారం 5,800 జరగడంతో ఈ సంఖ్య 1.02 లక్షలు దాటింది. ఆది, సోమవారాల్లో మరో 20 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నేడు, రేపు భక్తుల రద్దీ

రత్నగిరిపై ఆది, సోమవారాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగనుంది. ఆదివారం సుమారు 80 వేలు, సోమవారం లక్ష మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజామున ఒంటి గంటకే సత్యదేవుని వ్రతాలు, దర్శనాలు ప్రారంభించనున్నారు. దేవస్థానంలోని వ్రత మండపాలు, క్యూలైన్లు, పశ్చిమ రాజగోపురం వద్ద కంపార్టుమెంట్లను ఈఓ కె.రామచంద్ర మోహన్ పరిశీలించారు. సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ ఉన్నారు.



భక్తుల క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ

ఘనంగా జన్మనక్షత్ర పూజలు

జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని సత్యదేవునికి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరచి, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్లుకు, శివలింగానికి పండితులు పంచామృతాలతో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. తదనంతరం సుగంధభరిత పుష్పాలతో, స్వర్ణాభరణాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి, పూజించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. స్వామివారి యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఆయుష్య హోమం, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ పాల్గొన్నారు.

అంతర్వేదిలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: కార్తిక మాసం నాలుగో శనివారం సందర్భంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవాని, శివ మాలధారులు పోటెత్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో ఉన్న వారందరికీ తాగునీటి సదుపాయం కల్పించారు. ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో డ్వాక్రా యానిమేటర్ ?

అన్నవరం: టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలను కూడా వదలడం లేదనడానికి సాక్ష్యమిది. అన్నవరంలో డ్వాక్రా యానిమేటర్‌గా పని చేస్తున్న పి.అప్పలకొండ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులను టీడీపీ సభ్యత్వం, నమోదు కార్యక్రమంలో ఉపయోగించుకుంటున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి సాక్ష్యంగా స్థానిక టీడీపీ నాయకుడొకరు డ్వాక్రా యానిమేటర్‌తో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోను శనివారం స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వాలు చేస్తున్నట్లు ఆ పోస్టులో పేర్కొనడం మరింత వివాదాస్పదమవుతోంది.



సోషల్ మీడియాలో టీడీపీ నాయకుడు పోస్ట్ చేసిన ఫొటోలో డ్వాక్రా యానిమేటర్ అప్పలకొండ

క్లుప్తంగా

స్వదేశానికి చేరుకున్న కువైట్ బాధితురాలు


కుమారిని పరామర్శిస్తున్న బంధువులు, గ్రామస్తులు

గండేపల్లి: జీవనోపాధి కోసం కువైట్ వెళ్లి అష్టక ష్టాలు పడిన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన గారా కుమారి శనివారం తన ఇంటికి చేరుకుంది. ఆమె గురువారం కువైట్‌లో విమానంలో బయలుదేరి శుక్రవారం హైదరాబాద్ వచ్చింది. అక్కడి నుంచి శనివారం తెల్లవారుజామున స్వగ్రామం చేరింది. ఆమెను చూసిన వెంటనే తల్లితండ్రులు కనిపే సీత, అప్పారావు, పిల్లల ఆనందానికి అవధులు లేవు. కుమారికి పెళ్లయిన ఐదేళ్లకే భర్త వెంకటేష్ మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ కోసం మే నెలలో కువైట్ వెళ్లింది. అక్కడ నెలకు రూ.120 దినార్లు (రూ.33 వేలు) జీతానికి ఒక ఇంట్లో పనికి కుదిరింది. ఏడు నెలలకే ఇంటి యజమాని చేతిలో హింసలకు గురైంది. చివరకు అధికారులు, ప్రభుత్వం చొరవతో ఇంటికి చేరుకుంది. సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి, సుబ్బు, కర్రిపోతు సూర్యచంద్ర తదితరులు కుమారిని పరామర్శించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు


ప్రత్తిపాడు: పోక్సో కేసులో నిందితుడిని శనివారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బాలికలను ఆమె బంధువు మోర్త కిషోర్ మాయ మాటలు చెప్పి, గత సోమవారం రాత్రి తీసుకుపోయాడు. వారిద్దరినీ ప్రత్తిపాడు గ్రామ శివారు ప్రగతి స్కూల్ సమీపంలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. గురువారం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసులో మోర్త కిషోర్‌ను అరెస్టు చేశారు.

ఆట్యా పాట్యా జట్ల ఎంపిక రేపు

తుని: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తునిలోని రాజా కళాశాల క్రీడా మైదానంలో మహిళ, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహించనున్నారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ జీవీవీ సత్యనారాయణ ఈ విషయాన్ని శనివారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఎంపికలకు ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు, స్పోర్ట్స్ యూనిఫారంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా పోటీలలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యదర్శి పి.ప్రశాంత్ కుమార్ 99596 85789, విక్టర్ బాబు 99482 83945 ను సంప్రదించాలన్నారు.

రాజ్యాంగ పీఠిక.. స్ఫూర్తి దీపిక..

- పాఠశాలల్లో నూతన కార్యక్రమం
- వందేమాతరం తరహాలోనే నిత్య పఠనం
- 26 నుంచి కొత్తపేట మండలంలో అమలు


డాక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన 1950లో జరిగిన ముసాయిదా కమిటీ సమావేశం (ఫైల్)

కొత్తపేట: మన దేశ రాజ్యాంగం ఎంతో విశిష్టమైనది. దేశాన్ని పాలకులు ఎలా నడిపించాలి, ప్రజల హక్కులు, బాధ్యతలు, నియమాలు, నిబంధనలు ఇలా అనేక విషయాలతో దీన్ని రూపొందించారు. ప్రజలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ ఎంతో మహానుభావులు ఏళ్ల తరబడి కష్టబడి తయారు చేశారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, దేశంలో జరుగుతున్న సమర్థ పాలన రాజ్యాంగం గొప్పదనమే. రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, 1950 జనవరి 26న అమల్లోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి మన దేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. ఈ నేపథ్యంలో రాజ్యాగంపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 26 నుంచి ఓ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

ఆదర్శనీయం

ప్రపంచ దేశాలకు ఆదర్శమైన భారత రాజ్యాంగం గొప్పదనం విద్యాధికులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ తెలియాలనే ఆలోచన కొత్తపేట ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ మదిలో మెదిలింది. ముందుగా ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవగాహన కలగాలని, ఆ దశ నుంచే వారి మనసుల్లో దేశభక్తి, రాజ్యాంగ విలువలు నిక్షిప్తం కావాలని ఆయన భావించారు. ప్రతి రోజూ పాఠశాలల్లో నిర్వహించే అసెంబ్లీ సమయంలో వందేమాతరం, జాతీయ ప్రతిజ్ఞ, జనగణమన తరహాలోనే రాజ్యాంగ పీఠిక (రాజ్యాంగం మొదటి పేజీలో ప్రవేశిక)ను పఠింపజేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని గత నెల 17 న ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగిన మండల పజాపరిషత్ సమావేశంలో ప్రవేశ పెట్టారు. దాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి ద్వారా అన్ని పాఠశాలలకు సమాచారం ఇచ్చారు. హెచ్ఎంలతో జూమ్ మీటింగ్‌ల ద్వారా కార్యక్రమం నిర్వహణపై సూచనలు చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి రాజ్యాంగ పీఠికను పఠించేందుకు శ్రీకారం చుట్టనున్నారు. ఒక రోజు తెలుగు, మరో ఇంగ్లిషులో పఠించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలలకు రాజ్యాంగ పీఠిక ఫ్లెక్సీలను అందజేశారు.

ప్రవేశిక ప్రాధాన్యం

మన దేశాన్ని వదిలి వెళ్లేందుకు 1946లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక, ఆ ఏడాది డిసెంబర్ 9న 389 మంది సభ్యులతో రాజ్యాంగ పరిషత్ (పార్లమెంటుకు తొలిరూపం) ఏర్పడింది. 1947 ఆగస్టు 15 న దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అదే నెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షుడిగా ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ ఏర్పడింది. రాజ్యాంగ కమిటీలో మొత్తం 22 సబ్ కమిటీలు ఉండగా, వాటిలో ప్రధాన కమిటీలు 8 ఉన్నాయి. వాటిలో డాక్టర్ అంబేడ్కర్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన ముసాయిదా కమిటీ రాజ్యాంగం తుది ప్రతిని రూపొందించింది. రాజ్యాంగ రచన పూర్తి చేయడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. భారత రాజ్యాంగం ఈ పీఠికతోనే మొదలవుతుంది. దేశ ప్రజలు ఆకాంక్షలు, ఆశయాలు, కోరికలు ఈ పీఠికలో స్పష్టంగా ఉంటాయి. దీన్ని రాజ్యాంగానికి ఆత్మ, హృదయంగా పిలుస్తారు. ఈ పీఠికను రాజ్యాంగంలో అంతర్గత భాగంగా సుప్రీంకోర్టు పేర్కొంది.



పాఠశాలలకు అందజేసిన రాజ్యాంగ పీఠిక ఫ్లెక్సీ

దేశభక్తి పెరుగుతుంది



రాజ్యాంగ పీఠిక పఠనంతో విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుంది. రాజ్యాగం రచించిన మహనీయుల గురించి తెలుస్తుంది. ఆ విషయాలను పాఠాలలో చదువుతున్నప్పటికీ రోజూ పఠించడం వల్ల మరింత అవగాహన కలుగుతుంది. ప్రపంచ మేధావి అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన ఆశయాల సాధనకు భారతీయులందరూ కృషి చేయాలి.

– పీఎస్ నరేష్‌కుమార్, ఎంపీడీఓ, కొత్తపేట

రూ.20 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో పోలీసుల తనిఖీలు
- కేరళకు చెందిన నలుగురి అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్ నాయక్

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 16)పై దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద శనివారం ఉదయం 7 గంటల సమయంలో 40 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.నాగేశ్వర్ నాయక్ వెల్లడించారు. ఈ గంజాయిని ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి తమిళనాడులోని కోయంబత్తూరుకు నలుగురు వ్యక్తులు మోటారు సైకిళ్లపై తరలిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వీరిని కేరళకు చెందిన అమల్ కృష్ణ, మహమ్మద్ సాహల్, సాహల్ మొబిన్, అభినవ్ పునతిల్ ముత్తల్‌గా గుర్తించారు. రెండు మోటారు సైకిళ్లపై మూడు మూటల్లో గంజాయి తీసుకు వెళుతున్నారు. దాని విలువ రూ.20 లక్షల ఉంటుందని అంచనా. నిందితులను అరెస్టు చేసి, బైక్‌లను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై వి.సుబ్రహమణ్యం, వి.చంద్రశేఖర్, కేసీహెచ్ భీమరాజు, ఎస్‌కే సలీమ్, వి.బాలచంద్రరావు, కె.రామ్‌గోపాల్, పి.రామారావును అభినందించారు.


దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద పట్టుబడిన గంజాయి

యువకుడికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో టిప్పర్, బైక్

తొండంగి: గ్రామ శివారు కామయ్య గెడ్డ వద్ద బైకును టిప్పర్ ఢీకొట్టిన సంఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గంపల మురళీ ఒంటిమామిడి నుంచి బైకుపై స్వగ్రామమైన తొండంగి వస్తున్నాడు. కామయ్యగెడ్డ మలుపు వద్ద ఒంటిమామిడి వైపు వెళ్తున్న టిప్పర్ బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మురళీని స్థానికులు తుని ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నవ దంపతులకు ఎన్‌ఆర్‌ఐల పెళ్లి కానుక


నవ దంపతులకు పెళ్లికానుక అందిస్తున్న ఎన్ఆర్ఐ సత్యదుర్గ

అన్నవరం: అమెరికాలో స్థిరపడిన ఉమ్మడి తూర్పుగోదావరికి ఎన్ఆర్ఐలు శుక్రవారం రాత్రి సత్యదేవుని సన్నిధిలో వివాహాలు చేసుకున్న ఎనిమిది మంది పేద జంటలకు పెళ్లికానుక అందించారు. రెండు గ్రాముల బంగారంతో చేసిన జత కమ్మెలు, పట్టుచీర, పంచె, కండువా, పసుపు కుంకుమ కింద రూ.వెయ్యి చొప్పున అందించారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుంది. గోపిశెట్టి చంద్రశేఖర్, నగజ దంపతులు (అమలాపురం), గెడ్డం సూర్య, సత్యదుర్గ (సౌమ్య) దంపతులు (అన్నవరం) అమెరికాలో స్థిరపడ్డారు. రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో వివాహం చేసుకున్న 11 మంది జంటలకు పెళ్లికానుక అందిస్తామని మొక్కుకున్నారు. దీనిలో భాగంగా రత్నగిరిపై మట్టే శ్రీనివాస్ దంపతులు నిర్మించిన సత్య శ్రీనివాస కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి వివాహాలు చేసుకున్న ఎనిమిది జంటలకు సత్యదుర్గ వీటిని అందించారు. మరో మూడు జంటలకు కూడా త్వరలో అందజేస్తామని ఆమె తెలిపారు.

రత్నగిరిపై సత్యదీక్షల విరమణ


రత్నగిరిపై అర్చకులకు ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తున్న సత్యస్వాములు

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం సత్యస్వాములు దీక్షను విరమించారు. వీరందరూ 9, 14, 27 రోజుల పాటు సత్యదీక్షను ఆచరించారు. ముందుగా స్వామివారి వార్షిక కల్యాణ మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లకు శనివారం తెల్లవారుజామున అభిషేకం నిర్వహించారు. అనంతరం సత్య దీక్ష చేపట్టిన స్వాములు..అర్చకులకు ఇరుముడులు సమర్పించి, వారి చేతుల మీదుగా దీక్షామాలలు విసర్జించి దీక్ష విరమించారు. సుమారు మూడు వేల మంది దీక్ష విరమించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గిరిజన ప్రాంతాల నుంచి విచ్చేసిన 500 మంది ఉన్నారు. ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు చెందిన సత్య దీక్ష స్వాములు దీక్షా ప్రచారకర్త కృష్ణ బాబు ఆధ్వర్యంలో రత్నగిరిపై దీక్ష విరమించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చక స్వాములు దత్తాత్రేయ శర్మ, సుధీర్, పవన్ పాల్గొన్నారు.

బిడ్డను చూడకుండానే అనంత లోకాలకు..

- మగబిడ్డకు జన్మనిచ్చి, తల్లి మృతి
- గోకవరం ఆస్పత్రిలో విషాదం
- మృతురాలు అటవీ శాఖ ఉద్యోగిని


ఆస్పత్రిలో వైద్య సిబ్బంది పర్యవేక్షణలో పసికందు

గోకవరం: పండంటి మగబిడ్డను జన్మనిచ్చిన తల్లి.. తన బిడ్డను చూసుకోకుండానే కన్నుమూసింది. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఈ విషాద ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన వెంకటలక్ష్మి (35) రెండేళ్లుగా గోకవరంలో ఫారెస్టు ఠాణాలో ఠాణాదార్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త దుర్గాప్రసాద్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటలక్ష్మి గర్భం దాల్చి నెలలు నిండటంతో తొలి కాన్పు కోసం శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రి డాక్టర్లు పరీక్షించి శనివారం శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శస్త్ర చికిత్స చేయగా మగబిడ్డకు జన్మనిచ్చి ఆమె మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న భర్త, కుటుంబ సభ్యులు, తోటి అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని విలపించారు. అనంతరం వెంకటలక్ష్మి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వస్థలానికి తీసుకువెళ్లారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజా కుమారిని వివరణ కోరగా ఉమ్మనీరు రక్తంలో కలవడంతో గుండె పోటుకు గురై తల్లి మృతి చెందిందన్నారు. 35 ఏళ్లకు గర్భం దాల్చడం, ఒబెసిటీ కారణంగా ఎక్కువగా ఇటువంటి పరిస్థితి తలెత్తే అవకాశం ఉందన్నారు.


బీరబోయిన వెంకటలక్ష్మి (ఫైల్)

అటవీశాఖలో విషాదం

విధి నిర్వహణలో తోటి సిబ్బందితో ఎంతో కలివిడిగా ఉంటూ క్రమశిక్షణగా విధులు నిర్వహించే వెంకటలక్ష్మి మృతి చెందడంతో అటవీశాఖలో విషాదం నెలకొంది. ఆమె వెయిట్ లిఫ్టింగ్, త్రోబాల్ వంటి పోటీల్లో అటవీశాఖ తరఫున పాల్గొనేదని, 15 రోజుల క్రితం వరకు విధులు నిర్వహించిందని తోటి ఉద్యోగులు తెలిపారు. డీసీహెచ్ఎస్ ఎస్.పద్మశ్రీ రాణి ఆసుపత్రికి వచ్చి ఈ ఘటనపై విచారణ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వనజాకుమారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఓఎన్జీజీ బావి నుంచి ఆయిల్ చోరీ

- ఇద్దరు దొంగలు, కొనుగోలుదారుడి అరెస్ట్
- చల్లపల్లిలో ఐదు నెలలుగా సాగుతున్న దోపిడీ

అమలాపురం టౌన్: ఓఎన్జీసీ బావి వద్ద రాత్రి సమయాల్లో ఆయిల్‌ను చోరీ చేస్తున్న ఇద్దరిని, వారి నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న వ్యక్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, రూరల్ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు, ఎస్సై సీహెచ్ రాజేష్ శనివారం సాయంత్రం రూరల్ సర్కిల్ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. చల్లపల్లి గ్రామంలోని ఓఎన్జీసీ సైట్‌లోని జీఎం –14 వైల్ (బావి) వద్ద నిర్వహణ కోసం ఉన్న వైట్ ఆయిల్ వచ్చే గ్యాస్ ప్రెజర్ వెల్ నాబ్ వద్ద ఐదు నెలలుగా ఆయిల్ చోరీ జరుగుతోంది. ఇటీవల అక్కడ కొందరు ఆయిల్ చోరీ చేస్తుండగా బావి లీక్ అయ్యి పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై ఓఎన్జీసీ రెసిడెంట్ ఇంజినీర్ సీహెచ్ రామకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ చోరీలకు పాల్పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా దొడ్డిపట్ల శివారు వాకలగరువుకు చెందిన గుడాల రమేష్ (పాత నేరస్తుడు), పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన జోగి ధనరాజు, వీరి నుంచి ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న అంబాజీపేట మండలం కె.పెదపూడికి చెందిన పంజా నూకరాజు ఉప్పలగుప్తం పోలీసులు అరెస్టు చేశారు.

అత్యంత ప్రమాదకరంగా..

నిందితులు ఇద్దరూ చల్లపల్లి బావి నుంచి నెలకు మూడు సార్లు 60 లీటర్ల వంతున ఆయిల్‌ను చోరీ చేస్తున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. బావి వద్ద వెల్ నాబ్‌కు వేరే పైపు లైన్ బిగించి ఆయిల్‌ను లాగేస్తున్నారు. ఇలా చోరీ చేసిన ఆయిల్‌ను మోటార్ సైకిల్‌పై కె.పెదపూడి తీసుకుని వెళ్లి లీటరు రూ.50కి అమ్ముతున్నారు. అక్రమంగా కొనుగోలు చేసిన ఆయిల్‌ను నూకరాజు రొయ్యలు, చేపల చెరువుల వద్ద ఉపయోగించే ఇంజిన్లకు లీటరుకు రూ.80 వంతున లాభం వేసుకుని అమ్ముతున్నట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లావారుజాము 3 గంటల వరకూ అత్యంత ప్రమాదక పరిస్థితుల్లో ఆయిల్‌ను వీరు చోరీ చేస్తున్నట్లు తేలింది.


కేసు వివరాలను వెల్లడిస్తున్న అమలాపురం డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సై రాజేష్

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- ఏటిగట్టుపై మూటలతో అమ్మకాలు
- కానూరు, పెండ్యాల గ్రామాల్లో అక్రమ నిల్వలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పెరవలి: ఇసుక దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక కోసం వచ్చిన నిర్మాణదారులు, ట్రాక్టర్లు, లారీ డ్రైవర్ల నుంచి ముక్కుపిండి మరీ సొమ్ములు వసూలు చేస్తున్నారు. దళారులు రాత్రిళ్ల ఇసుక తోలకాలు జరిపి, పగలు మూటలు కట్టి ఎగుమతి చేస్తున్నారు. పట్టపగలే ఏటిగట్టుపై మూటలు కట్టి ఇసుక అమ్మకాలు జోరుగా చేస్తున్నా అధికారుల కంటికి కనిపించకపోవటం విడ్డూరంగా ఉంది. కానూరు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, పెండ్యాల గ్రామాల్లో ఇంటింటి వద్ద ఇసుక నిల్వలు ఉన్నా ఏ అధికారి అటువైపు కన్నెత్తి చూడడం లేదు. టీడీపీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో దళారీల జోలికి ఎవరూ వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక అక్రమ తవ్వకాలు ఆపాలి

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెం శివారు జిల్లేడులంక సమీపంలో తాము శ్మశానంగా వినియోగిస్తున్న లంకలో అక్రమ ఇసుక తవ్వకాలు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కత్తులవారిపేట, కొక్కిరివారిపేట, రజకపేట, చింతపల్లివారి పేటలకు చెందిన ప్రజలు రెండో రోజైన శనివారం కూడా ఆందోళన నిర్వహించారు. తాటికాయలవారి పాలెం వంతెనపై ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అధికార పార్టీ నేతల అండతో ఆ భూముల్లో ఇసుకను తవ్వి తరలించుకుపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలతో పెద్ద గుంతలు ఏర్పడి సమీపంలోని లంకలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి సమస్యను వివరించారు. దీంతో తహసీల్దార్ శ్రీపల్లవి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి లంక భూములను పరిశీలించారు. దీనిపై మండల స్థాయిలో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.


కానూరు అగ్రహారంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఇసుక బస్తాలు